'మాక్ అసెంబ్లీ' విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యార్థినీ విద్యార్థులను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి అభినందించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గం నుంచి కె.ఎం. హరిణి (9వ తరగతి), పుంగనూరు నుంచి జి. పూజ, కె. మేఘన (10వ తరగతి), కుప్పం నుంచి జి. శృతి, వి. లోకేష్ (10వ తరగతి), నగరి నుంచి ఎస్. పరిమళ (10వ తరగతి), బి. సోఫియా (9వ తరగతి), పూతలపట్టు నుంచి ఎస్. ప్రవల్లిక (9వ తరగతి), ధీరజ్ కుమార్ (10వ తరగతి), గంగాధరనెల్లూరు నుంచి పి. శశిర, పి. గోవర్ధన్ (10వ తరగతి), పలమనేరు నుంచి పరిణిత, జి. నందిని (9వ తరగతి) ,సర్వశిక్షా అభియాన్ ఏపీసీ వెంకటరమణ, డీఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం అడవిలో చిరుత

● మేకను చంపేయడంతో భయాందోళన

పూతలపట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లె అడవిలో వున్న చిరుత గోపాలపురం అటవీప్రాంతంలోకి వెళ్లి ఓ మేకను తినేయడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. కమ్మగుట్టపల్లి సమీపానగల కమ్మగుట్ట అటవీప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లిన కొంత మంది చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించారు.ఈ విషయం చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు తెలియడంతో భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఐరాల అటవీశాఖ అధికారులు గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు అవగాహన కల్పించి వెళ్లారు. అనంతరం ఈ చిరుత కమ్మగుట్టపల్లి సమీపాన గల గోపాలకృష్ణాపురం వద్ద వున్న అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. అక్కడ మూర్తిగాని వూరు గ్రామానికి చెందిన వజ్రం అనే రైతు తన పశువులతో పాటు మేకలను కూడా మేపేందుకు అడవిలో వదిలి ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం మేకలను, పశువులను ఇంటికి తరలించేందుకు అడవిలోకి వెళ్లగా మేక కళేబరం కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు.పశువులు, మేకలతో పరుగుపరుగున ఇల్లు చేరుకున్నాడు.ఈ విషయం చుట్టుపక్కల గ్రామస్తులకు తెలియడంతో ప్రజలు పొద్దుపోయాక ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు.

భగవద్గీత పారాయణ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు తపోవనం ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల, ఇంటర్ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పారాయణ పోటీలను టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ నిర్వహించింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీతలోని గుణత్రయ విభాగ యోగం శ్లోకాల పోటీల్లో 64 మంది పాల్గొనగా, చిత్తూరు విజయం సీబీఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని పి.సుకీర్తి ప్రథమ బహుమతి గెలుచుకుంది. పది నుంచి ఇంటర్ స్థాయి వారికి నిర్వహించిన దైవాసుర సంపద్విభాగయోగం శ్లోకాల పోటీల్లో 26 మంది పాల్గొనగా, చిత్తూరు విజ్ఞాన సుధ జూనియర్ కళాశాల విద్యార్థి వి.నారాయణ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు. 14 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోపున్న వారికి నిత్యజీవితంలో భగవద్గీత అనే అంశంపై నిర్వహించిన భావ విశ్లేషణ పోటీల్లో 24మంది పాల్గొనగా, తపోవనం ఇస్కాన్ ఉపాధ్యాయురాలు రేవతి ప్రథమ బహుమతిని గెలుపొందారు. న్యాయ నిర్ణేతలుగా రంగస్వామి, వి.హేమలత, లలిత, కుప్పయ్య, మునస్వామి, రంగారావు, పి.హేమలత, సిద్ధిరామిరెడ్డి తదితరులు వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు పంపిణీ చేశారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు గీతా జయంతి రోజున రాష్ట్రస్థాయి పోటీలను తిరుపతిలో నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ భద్రావతి తెలిపారు.

నేడు పూలే వర్ధంతి సందర్భంగా నివాళులు

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమం, సాధికారిత అధికారి రబ్బాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, బీసీ సంఘ నేతలు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు,ఎల్లుండి భారీ వర్ష సూచన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింతబలపడి ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ, విపత్తుల శాఖ గురువారం బులెటిన్ విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా చెదురుమదురుతో ప్రారంభమై భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం రైతులను, ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొంది.

బి.కొత్తకోట రిజిస్ట్రార్ ఆఫీస్‌లో అక్రమాలపై విచారణకు

జిల్లా రిజిస్ట్రార్ నియామకం



రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణకు అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఎ. వెంకటరమణమూర్తిని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ నియమించారు.ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులపై కడప జిల్లా డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఈ నెల 25న బి.కొత్తకోటకు చేరుకుని విచారణ జరిపారు. అక్కడి అక్రమాలపై పలువురు కక్షిదారులు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి అక్రమాల డొంక కదిలింది. పలువురు కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ అవినీతిపై పిటిషన్ల రూపంలో అక్రమాలను వివరించారు. ఆస్తులు, క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువలో ఒకశాతం లంచం రూపంలో ఇవ్వాల్సిందేనని, ఇవ్వకుంటే వివిధ రకాలుగా కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయకుండా వాయిదాలు వేశారని ఆరోపించారు. స్టాంపులను వెండర్లు అధిక ధరకు అమ్ముతున్నారని, ఈసీ నకళ్లు జారీ చేయడానికి అధిక లంచం అడుగుతున్నారని ఆరోపించారు.దీంతో చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఏఎస్ఆర్ మూర్తిని పిటిషనర్లకు నోటీసులు ఇచ్చి విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ ఆదేశించారు. కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజీలను, ఫైళ్లను పరిశీలించి నివేదికను ఇవ్వాలని పేర్కొన్నారు.



చిత్తూరు డివిజన్‌లోకి బంగారుపాళ్యం

- పుంగనూరు నియోజకవర్గంలోని 4మండలాలు మదనపల్లె జిల్లాలోకి
- ప్రిలిమినరీ గెజిట్ విడుదలకు ప్రభుత్వ ఉత్తర్వులు
- చిత్తూరులో నాలుగు డివిజన్ల కొనసాగింపు

చిత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న బంగారుపాళ్యం మండలం చిత్తూరు డివిజన్‌లో కలవనుంది. అలాగే పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మదనపల్లె జిల్లాలో కలవనున్నాయి. ఈ మేరకు ప్రిలిమినరీ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని గురువారం కలెక్టర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కలెక్టర్ ప్రిలిమినరీ గెజిట్‌ను విడుదల చేయగా, 30 రోజుల వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఫైనల్ గెజిట్ ప్రచురించి ఆయా నిర్ణయాలను అమలు చేయనున్నారు.

మదనపల్లె జిల్లా ఏర్పాటు చేసి అందులోకి పుంగనూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలను చేర్చాలని క్యాబినెట్ సబ్ కమిటీ సిఫార్సును సీఎం చంద్రబాబు ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. 19 మండలాలతో ఏర్పాటవుతున్న మదనపల్లె జిల్లాకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ జిల్లాలో మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లు ఉంటాయి.ఇప్పటికే మదనపల్లె డివిజన్‌లో ఉన్న మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం,తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, పీటీఎం, బి.కొత్తకోట మండలాలు కొనసాగుతాయి. పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లె, పుంగనూరు మండలాలు అదనంగా మదనపల్లె డివిజనులోకి కలవనున్నాయి.కొత్తగా ఏర్పాటు కానున్న పీలేరు డివిజనులో మూడు డివిజన్లలోని 8 మండలాలను కలపనున్నారు. పలమనేరు డివిజన్ నుంచి సోమల, సదుం.. రాయచోటి డివిజన్ నుంచి పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె.. మదనపల్లె డివిజన్‌లో నుంచి కలికిరి, వాల్మీకిపురం మండలాలను పీలేరులో కలుపుతున్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లోకి మార్చనున్నారు. దీంతో పలమనేరు డివిజన్ నుంచి ఏకంగా 5 మండలాలు పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, బంగారుపాళ్యం తగ్గిపోనున్నాయి.

చిత్తూరు డివిజనే పెద్దది

పునర్విభజన తర్వాత మిగిలిన చిత్తూరు జిల్లా పరిధి తగ్గినా.. రెవెన్యూ డివిజన్లు మాత్రం నాలుగు ఉంటాయి. చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి డివిజన్లలో చిత్తూరు పెద్దదిగా మారింది. జిల్లాలో మొత్తం 28 మండలాలుండగా, అందులో సగం అంటే 14 చిత్తూరులోనే ఉన్నాయి. కుప్పంలో 4, పలమనేరులో 5, నగరిలో 5 మండలాల చొప్పున ఉన్నాయి. ఓసారి డివిజన్ల స్వరూపం చూస్తే.. కుప్పం డివిజనులో అక్కడి నాలుగు మండలాలు, పలమనేరు డివిజనులో ఆ నియోజకవర్గంలోని ఐదు మండలాలు ఉంటాయి. అలాగే నగరి డివిజనులో నగరి, నిండ్ర, విజయపురంతో పాటు పాలసముద్రం, కార్వేటినగరం మండలాలుంటాయి. ఫైనల్‌గా చిత్తూరు డివిజన్‌లో పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు, చిత్తూరు నియోజకవర్గంలోని మూడు, జీడీనెల్లూరు నియోజకవర్గంలోని నాలుగు, పుంగనూరు నియోజకవర్గంలోని రెండు మండలాలుంటాయి.

చిత్తూరులో 'దేవగుడి' సందడి



విజయం కళాశాలలో 'దేవగుడి' మూవీ బృందం

చిత్తూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో గురువారం 'దేవగుడి' సినిమా బృందం సందడి చేసింది. ముందుగా నగర శివారు ప్రాంతంలోని విజయం విద్యాసంస్థలో టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సినిమా దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కంటెంట్‌ను నమ్మి తీసిన చిత్రం దేవగుడి అన్నారు. రాయలసీమ నేపథ్యంలో ప్రజలను ఆకట్టుకునేలా తీసిన దేవగుడి చిత్రానికి విజయాన్ని చేకూర్చాలని కోరారు. డిసెంబర్ 19న ప్రేక్షకుల మధ్యకు రాబోతున్న ఈ సినిమాలో హైదరాబాదుకు చెందిన అభినవ్ శౌర్య హీరోగా, భీమవరానికి చెందిన అనుశ్రీ హీరోయిన్‌గా నటించారన్నారు.నగరంలోని ఎస్వీ కళాశాలలో కూడా సినీ బృందం విద్యార్థులతో ముచ్చటించింది. విజయం కళాశాల చైర్మన్ తేజోమూర్తి, ఏవో రాజగోపాల నాయుడు, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మినీమార్టులుగా రేషన్‌షాపులు

● పైలట్ ప్రాజెక్టుగా చిత్తూరు, పల్నాడు జిల్లాల ఎంపిక



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):రేషన్ దుకాణడీలర్లకు మరింత ఆర్థిక చేయూత కల్పించే విధంగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని ఈజీ మార్ట్ సీఈవో వెంకట్ అన్నారు. గురువారం చిత్తూరు డివిజన్ స్థాయి చౌకదుకాణ డీలర్లతో డీఎస్వో శంకరన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో వెంకట్ మాట్లాడుతూ కార్డుదారులకు తక్కువ ధరలకే నిత్యావసర సరుకులను అందుబాటులోకి తెచ్చి వారికి ఆర్థిక ప్రయోజనం కల్పించాలని నిర్ణయించామన్నారు.ఇందుకోసం పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం చిత్తూరు, పల్నాడు జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. డీలర్లకు 12-15 శాతం కమీషన్ రూపేణా నెలకు రూ. 10నుంచి రూ. 15వేల ఆదాయం వచ్చేలా చేస్తామన్నారు. జిల్లాలోని 1379మంది డీలర్లకు నూతన సాంకేతికతతో కూడిన యాప్‌ను అందిస్తామన్నారు.దీని ద్వారా దుకాణానికి కావాల్సిన వస్తువులను ఆర్డర్ చేస్తే హోల్‌సేల్ ధరలకే ఉచిత డెలివరీ చేస్తామన్నారు. ఇప్పటికే తమ సంస్థ సెర్ప్, మెప్మాలతో ఒప్పందం కుదుర్చుకుని 1000 దుకాణాలకు వస్తువులను అందిస్తోందన్నారు. క్యాష్ అండ్ క్యారీ పద్ధతితో వ్యాపారం సాగిస్తామని, ప్రభుత్వంతో చర్చించి డీలర్లకు అవసరమైన రుణసదుపాయాన్ని బ్యాంకుల ద్వారా కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. డీఎస్వో శంకరన్ మాట్లాడుతూ రేషన్ దుకాణాలలో విక్రయించే వస్తువుల ధరలు బహిరంగ మార్కెట్, డీమార్ట్ కంటే తక్కువగా ఉండే విధంగా చూస్తామన్నారు.

గూడూరు డివిజన్‌లోకి ఆ మూడు మండలాలు

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది.వైసీపీ ప్రభుత్వం వెంకటగిరి నియోజకవర్గాన్ని నెల్లూరు, తిరుపతి జిల్లాల నడుమ విభజించిన సంగతి తెలిసిందే. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో చేరగా కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగుతున్నాయి.పాలనాపరంగా ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నెల్లూరు పరిధిలోని మూడు మండలాలను కూడా తిరుపతి జిల్లాలో కలపాలని నిర్ణయించింది. అందులో భాగంగా గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలుంటే నెల రోజుల లోపు తెలపాలని సూచించారు.

29మంది పీఆర్ సిబ్బందికి పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్, డీపీవో, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా, సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 29 మందికి డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా పదోన్నతి లభించింది.వీరిని మండల, గ్రామ సచివాలయ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జి. రాజేష్‌ను (కల్లివెట్టు జీపీ) ఐరాలకు, జాకీర్ హుస్సేన్‌ను (చౌడేపల్లి జీపీ) పెద్దపంజాణికి, ఎస్. మురళీని (డీపీవో కార్యాలయం) శ్రీరంగరాజపురానికి, జి. ప్రభు కిరణ్‌కుమార్‌ను (పెనుమూరు జీపీ) తవణంపల్లెకు, బి.కె. మురళీని (గుంటిపల్లి జీపీ) గుడిపాల మండలానికి నియమించారు. ఎన్. భాస్కర్ నాయుడిని(జడ్పీ) చిత్తూరుకు, పి.ఎం. చంద్రను (బొమ్మసముద్రం జీపీ) యాదమరికి, బి.ఎన్. సుధాకర్ రావును (గంగవరం జీపీ) పుంగనూరుకు, కె.పి. నిరంజన్ రెడ్డిని (ఈఈ, పీఆర్ఐ డివిజన్) వెదురుకుప్పానికి, కె. మురుగేశన్‌ను (అరగొండ జీపీ) గంగాధరనెల్లూరుకు కేటాయించారు. కె. సౌజన్యను (డీఈఈ, సబ్ డివిజన్) కార్వేటినగరానికి, ఎం. సత్యం రెడ్డిని(రొంపిచెర్ల జీపీ) పులిచెర్లకు, బి.లక్ష్మీపతిని (ఎంపీపీ, శ్రీకాళహస్తి) నగరికి, కె. హిమభూషణాన్ని (ఎంపీపీ, సత్యవేడు) విజయపురానికి, పి. శ్రీనివాసులు రెడ్డిని (కీలపట్ల) సోమలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. డి. ఖాదర్ షరీఫ్‌ను (డీఎల్పీవో కార్యాలయం, మదనపల్లె) గంగవరానికి, ఆర్. జనార్దన్‌ను (ఎంపీపీ, తొట్టంబేడు) నిండ్రకు, ఎం. యుగంధర్‌ను (డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ మదనపల్లె) పలమనేరుకు, సి. సుధాకర రెడ్డిని(ఎంపీపీ, రొంపిచెర్ల)రొంపిచెర్లకు, ఎస్. మస్తాన్‌వలీని(ఈఈ, పీఆర్ఐ మదనపల్లె) చౌడేపల్లెకు కేటాయించారు. ఎస్. ఇషార్‌తుల్లాను(ఈఈ, పీఆర్ఐ మదనపల్లె) సదుంకు, కె. లక్ష్మీదేవిని (ఎంపీపీ, వెదురుకుప్పం) పెనుమూరుకు, టి.ఎం. విజయ కుమార్ రెడ్డిని (పీఐయూ, చిత్తూరు) కుప్పానికి, సి. ఆనందరెడ్డిని (పీఆర్ఐ, చిత్తూరు) పూతలపట్టుకు, పి. మునిసుబ్రహ్మణ్యంను (డీఈఈ, పీఆర్ఐ సత్యవేడు) పాలసముద్రానికి అలాట్ చేశారు. జె.సుజాతను (డీఈఈ, పీఆర్ఐ కుప్పం)వి.కోటకు, ఎస్. అబ్దుల్ తస్లీమ్‌ను (ఎంపీపీ, రామకుప్పం)బంగారుపాళ్యానికి, జి. మహాలక్ష్మిని (ఎంపీపీ, వి.కోట)గుడుపల్లెకు, ఎం.ఎ.రామలక్ష్మమ్మను(డీఈఈ, పీఆర్ఐ కర్నూలు జిల్లా) బైరెడ్డిపల్లె మండలానికి నియమించారు.





పల్లకీలో పద్మావతి

● వేడుకగా మహంతు ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం పల్లకిలో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఈ మహంతు ఉత్సవంలో భాగంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం వద్దనున్న హథీరాంజీమఠంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి వేంచేపు చేశారు. హథీరాం మఠం తరఫున దేవదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి పల్లకిలో కొలువుదీరి తిరుమాడవీదుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. హథీరాంజీ మఠం పర్యవేక్షణాధికారి బాపిరెడ్డి, అమ్మవారి ఆలయ అధికారులు చలపతి, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,670

తలనీలాలు సమర్పించినవారు: 26,062



సాహిత్యంతో మహిళల్లో నాయకత్వ శక్తి

● ఉస్మానియా వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో ఎందరో రచయితలు మహిళల్లో నాయకత్వ పటిమను రగిలించారని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో గురువారం నిర్వహించిన పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సులో ఆయన 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ- కవిత్వం, నాటకం'పై ప్రసంగించారు. మహిళల జీవితంలోని అనేక సమస్యలను గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకంలోనూ, కాళ్ళకూరి నారాయణరావు 'వర విక్రయం' నాటకంలోనూ, శివసాగర్ 'చెల్లీ చెంద్రమ్మ' కవిత, గద్దర్ 'సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో' పాటలోనూ కనిపిస్తుందన్నారు. ఈ రచనల్లో రచయితలు కేవలం సమస్యలను వివరించడంతో సరిపెట్టుకోకుండా పరిష్కారాలనూ సూచించారన్నారు. తద్వారా మహిళల్లో నాయకత్వ పటిమను, పోరాట స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేశారని అభిప్రాయపడ్డారు. 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ - కథ, నవల' అంశంపై కడప యోగి వేమన వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎంఎం వినోదిని ప్రసంగించారు. మహిళలను మంచి మార్గంలో నడిపించేదే గొప్ప సాహిత్యమని పేర్కొన్నారు. మహిళల్లో నాయత్వ పటిమ అంటే నలుగురిని వెంట నిలబెట్టుకోవడం మాత్రమే కాదనీ, విపత్కర పరిస్థితుల్లో మనోనిబ్బరంతో నిలదొక్కుకోవడమని చెప్పారు. ఓల్గా, యద్దనపూడి సులోచనా రాణి, వాసిరెడ్డి సీతాదేవి వంటి వారి రచనలు చదవడం వల్ల మహిళలు చైతన్యం పొందవచ్చని పద్మావతి వర్సిటీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వాణి సూచించారు. నలుగురిని నడిపించడమే కాదు.. నాయకురాలిగా అందరినీ కలుపుగోలుగా ఒకే పథం వైపు నడిపించడం నాయకురాలి మౌలిక లక్షణమని తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఈ ధర్మనిధి సదస్సుకు ఆర్థిక సహకారాన్ని అందించిన రచయిత్రి ఓల్గాకు సదస్సు సంచాలకుడు డాక్టర్ యువశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా చేపట్టిన వ్యాస రచన పోటీలకు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కృష్ణవేణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు, సాహిత్యవేత్తలు, డాక్టర్ లక్ష్మీప్రియ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరును రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి డిమాండు చేశారు. అన్నారు. గురువారం జరిగిన గూడూరు ప్రజాసమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును జిల్లా చేసేందుకు అసరమైన భౌగోళిక మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా రెవెన్యూడివిజన్‌కి కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి మైకా, నిమ్మకాయలు విదేశాలకు ఎగుమతులు చేస్తుండడంతో గూడూరుకు గుర్తింపు ఉందన్నారు. రైల్వేజంక్షన్, పరిశ్రమలు, సముద్ర తీరం.. ఇలా అన్ని వనరులున్న గూడూరును జిల్లా కేంద్రంగా చేసుకునేందుకు జరపనున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాతో అనుబంధమున్న గూడూరును తిరుపతిజిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని కోరారు. లేదంటే ప్రజాసమితి అధ్వర్యంలో మొదటగా పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి.. దశలవారీగా ఉధ్రుతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి

నేడు విద్యాసంస్థల బంద్: ఏఎస్ఎఫ్

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) నేత షఫీహరన్, శ్యామ్‌కుమార్ గురువారం కోరారు. తిరుపతి జిల్లాలోని గూడూరును నెల్లూరులో కలుపుతామన్న హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు.

సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు జరుగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో గురువారం సాయంత్రం అంకుర్పాణ జరిగింది. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహిస్తారు. డిసెంబరు 13న పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగియనుంది. అంకురార్పణ కార్యక్రమంలో వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ ఎస్ఎస్ అవధాని, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని టీడీపీ నాయకుడు మృతిచెందిన సంఘటన గురువారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వేజీఆర్ పోలీసుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం వ్యాఖ్యం గ్రామానికి చెందిన నర్రావుల బాబు(49) గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి పనుల నిమిత్తం గూడూరుకు వెళ్లారు. గూడూరులోని రెండో ఫ్లాట్‌ఫాం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొంది. దీంతో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈయన వ్యాఖ్యం గ్రామంలో టీడీపీ గ్రామస్థాయి నాయకుడిగా కొనసాగుతున్నాడు. బాబు మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడులు తెలిపారు. బాబు మృతిచెందడంపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆక్వా బకాయిలు రూ.9 కోట్లు



సదరన్ డిస్కం కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో ఆక్వా బకాయిలు 9 కోట్లు వసూలు కావాల్సి ఉందని దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని సదరన్ డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి అన్నారు. కోట మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పలు ఏఈలు, సబ్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో ఆక్వా బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. 2600 ఆక్వా సర్వీసులు బకాయి ఉన్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వసూళ్లకు చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి సర్వీసుల విద్యుత్ బిల్లులపైనా ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామ న్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య, పలువురు ఏఈలు ఉన్నారు. అంతకుముందు ఆయన నూతన సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన చేశారు.

పరిశ్రమ నిర్వాహకుల్లో ఉత్తేజానికి 'కైజాన్'



విజేతలుగా నిలిచిన వారితో పరిశ్రమల నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వాహకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతోపాటు కొత్త ఆలోచనలు పంచుకోవడానికి 'కైజాన్' వంటి పోటీలు ఉపయోగపడతాయని సీఐఐ తిరుపతి వైస్‌ఛైర్మన్ ఎస్‌పీ రాజేంద్రన్ అన్నారు. తిరుపతిలో గురువారం సీఐఐ రాష్ట్ర స్థాయి కైజాన్ రెండవ ఎడిషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆపరేషన్స్ కేటగిరిలో మొదటి స్థానంలో అర్జాస్ స్టీల్స్ ప్రవేట్ లిమిటెడ్, ద్వితీయ స్థానంలో అపోలో టైర్స్, తృతీయ స్థానంలో ఐటీసీ లిమిటెడ్ నిలిచాయి. అలాగే సూపర్‌వైజర్ల స్థానంలో అపోలో టైర్స్, సుందరం ఫాస్నర్స్ లిమిటెడ్, కెల్లాగ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 20కు పైగా జట్లు పాల్గొన్నాయని రాజేంద్రన్ తెలిపారు. వీరి ఆలోచనలు ఒకరికి ఒకరు పంచుకోవడం కోసమే ఇటువంటి పోటీలను నిర్వహించామని, వీటిని ప్రోత్సాహంగానే భావించాల్సిన అవసరం ఉందన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూసీపీఐ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యాపకులు హనుమంతరావు, టీవీ కృష్ణారావు, డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

● గూడ్స్ షెడ్, ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ● పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సుముఖం





తడ రైల్వే స్టేషన్ - గూడ్స్‌షెడ్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. గూడ్స్‌షెడ్ నిర్మాణంతో పాటు ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. తడ... 2007కు ముందు వరకు ఓ మారుమూల కుగ్రామం. 2008లో శ్రీసిటీ, మాంబట్టు సెజ్ ఏర్పాటుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రెండు సెజ్‌లలో సుమారు 220కి పైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఒకప్పటి మారుమూల పల్లెటూరైన తడ నగరాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పుడు రైల్వేశాఖ తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది. తడ రైల్వేస్టేషన్‌లో ఒకప్పుడు ప్యాసింజర్ రైళ్లు ఆగేదే ఎక్కువ. సెజ్‌ల ఏర్పాటుతో 2010 నుంచి చెన్నై, సూళ్లూరుపేట మధ్య లోకల్ రైళ్లను ప్రవేశపెట్టారు. 2015లో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు చొరవతో ఇక్కడ నుంచి నేరుగా నెల్లూరుకు మెమూ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం నెల్లూరు, సూళ్లూరుపేట, చెన్నైకు 25 లోకల్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లోని పరిశ్రమల ఉత్పత్తులను రవాణా చేసేందుకు తడ రైల్వే స్టేషన్‌లోనే ఎగుమతుల కేంద్రానికి శ్రీసిటీ యాజమాన్యం ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే కొబెల్‌కో పరిశ్రమ తయారు చేసే ఎక్స్‌కవేటర్లను గూడ్స్‌లలో రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గూడ్స్ షెడ్‌తో పాటు ఎగుమతుల కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా సదరన్ రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ఇప్పటికే రైల్వేశాఖ పరిధిలో ఉన్న భూములతో పాటు మరో 25 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లుగా తెలిసింది. దొరవారిసత్రం రైల్వేస్టేషన్ నుంచి బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే పాయింట్‌ను సైతం తడకు తరలిస్తున్నారు. వీటితో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తడ రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

'శెట్టిపల్లె' లబ్ధిదారులకు త్వరలో ప్లాట్ల కేటాయింపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ శెట్టిపల్లె లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, తుడాచైర్మన్ దివాకర్‌రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తుడా భూసేకరణ అధికారి సుజన తదితరులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నూతన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తాం

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. విజయవాడ నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ గురువారం ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల అధికారులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణా కార్యక్రమం ముగిసిందన్నారు. ఓటర్ మ్యాపింగ్ కూడా పూర్తికావచ్చిందని, బీఎల్వోలకు ఐడీ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు సుధారాణి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలకు మరమ్మతులు పూర్తి చేయండి

జిల్లాలోని హాస్టళ్లలో మరమ్మతు పనులు వేగవంతంచేయాలని గురువారం జరిగిన సమీక్షలో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంతలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు విక్రమ్ కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రాజా సోము, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 20 దుంగలు స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరుస్మగ్లర్లను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ అల్లీబాషా బృందం, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జాన్ శ్యాముల్‌తో కలిసి మామండూరు అటవీప్రాంతంలో బుధవారం నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కాకిరేవులపెంట వద్ద ఇద్దరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకోగా.. మామండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని విచారించి.. దాచి ఉన్న 20 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వారితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై కేసు కొట్టేయడం శుభపరిణామం



న్యాయదేవత, సీఎం చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం

తిరుపతి(జీవకోన), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై గతంలో జగన్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసును కొట్టివేయడం శుభపరిణామమని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు, నగర అధ్యక్షుడు జేడబ్ల్యూ విజయకుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వీరు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ ఫైబర్ నెట్ ద్వారా వేలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. దీనిని ఓర్వలేని జగన్ ప్రభుత్వం అక్రమ కేసును బనాయించడంతో వేలాది ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పోరాటం చేయడంతో న్యాయస్థానం ఆ కేసును కొట్టేసిందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌కు పూర్వవైభవం వచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తారని మళ్లీవేలాది ఆపరేటర్ల కుటుంబాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఈ సందర్భంగా న్యాయదేవత, చంద్రబాబు చిత్రాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు ఆనంద్, శంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

రైల్వే డివిజన్ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సాధన సమితి సభ్యులతో కలెక్టర్



తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బాలాజి రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, జనవరిలో సీఎం నారావారిపల్లెకు వస్తున్నారని, ఆయన్ను కలిసే అవకాశం కల్పిస్తానని కలెక్టర్ వారితో చెప్పారు. నగరి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలను కూడా కొత్తగా ఏర్పడే సౌత్ కోస్తా రైల్వేలో కలిపితే బాగుంటుందని కమిటీ సభ్యులు తెలుపగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికీ వినతిపత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, సి.కృష్ణయ్య, అనిల్ కుమార్, నీలేష్, కుమార్, టీవీ రావు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు చంద్రమాకులపల్లె విద్యార్థులు



పుంగనూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫుట్‌బాల్ క్రీడాపోటీలకు పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జడ్పీహైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరమణ, పీడీ మురళీధర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల మదనపల్లె గ్రీన్‌వ్యాలీలో జరిగిన రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-14 ఫుట్‌బాల్ క్రీడలో చిత్తూరు బాలుర జట్టు రెండో స్థానంలో నిలిచాయన్నారు. చంద్రమాకులపల్లె హైస్కూల్ ఎనిమిదో తరగతి చదువుతున్న ఒంటిమిట్టకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు వై.విజయ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే బాలికల జట్టు నుంచి గోల్‌కీపర్‌గా ప్రతిభ కనబరిచిన శివకుమార్ కుమార్తె గానవి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. జార్ఖండ్‌లోని రాంచీలో డిసెంబరు 3వ వారంలో జరిగే జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, రమణమ్మ, శంకర్‌రెడ్డి, రఘు, సూజాత, చైర్మన్ నారాయణ, మంగమ్మ, విద్యార్థులు అభినందించారు.

పుంగనూరులో దత్తపీఠం ఏర్పాటుకు అవకాశం

● విజయానంద తీర్థస్వామి



శాంతి సందేశమిస్తున్న దత్తపీఠాధిపతి విజయానందతీర్థస్వామి

పుంగనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీతను కంఠస్థం చేయడం అలవర్చుకోవాలని మైసూరు అవధూత దత్తపీఠాధిపతి విజయానందతీర్థస్వామి సూచించారు.పుంగనూరు సుబేదారువీధిలోని దత్త కాళికా కమటేశ్వరస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని గురువారం సందర్శించిన ఆయన రుద్రాభిషేకం, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పంచముఖ మరకత ఆంజనేయస్వామి ప్రతిష్ఠ, శ్రీచక్రస్థాపనకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు అంటే గోమాత గుర్తుకు వస్తుందని, గోమాత బాగుంటేనే భూమాత బాగుంటుందన్నారు. పుంగనూరులో దత్తపీఠం ఏర్పాటు చేయాలని ఆలయ ధర్మకర్త చనకంటి శేషాద్రి కోరారని,కాబట్టి ఏర్పాటుకు అవకాశం వుందని తెలిపారు.చనకంటి శేషాద్రి, ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం, క్షత్రియ సంఘ అధ్యక్షుడు భక్తవత్సలరాజు, పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి మనోహర్,సీఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిూస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిూస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఓ హోటల్‌లో గురువారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దయ్య (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా టి.జయరాం(తిరుపతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మస్తాన్ (అనంతపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుబ్బన్న (కర్నూలు),కోశాధికారిగా నాగరాజు(శ్రీకాళహస్తి), ఉపాధ్యక్షులుగా శీనయ్య (వెంకటగిరి), సహాయ కార్యదర్శులుగా రమణయ్య(నెల్లూరు), ఐ.వరయ్య (కడప)లతోపాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



నారావారిపల్లె క్లస్టర్‌లో పంటను పరిశీలిస్తున్న డైరెక్టర్ నీరజ

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):చంద్రగిరి మండలంలోని నారావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికారిత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ గురువారం సందర్శించారు. ఆర్‌వైఎస్‌ఎస్ అధికారులతో కలిసి నారావారిపల్లె క్లస్టర్‌లో సాగు చేస్తున్న ఏటీఎం, ఏ-గ్రేడ్, పీఎండీఎస్, హెల్త్ అండ్ న్యూట్రీషన్ నమూనా పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న పంటల పెట్టుబడి వ్యయం, దిగుబడి, ఆదాయం వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఎం షణ్ముగం, అదనపు డీపీఎం ప్రతాప్‌రెడ్డి, జిల్లా యాంకర్ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడాది పొడిగింపు

తిరుపతిరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ సేవలను మరో ఏడాది పాటు కొనసాగింపునకు అనుమతిస్తూ పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 16 విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల అగైనెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న 33 మంది అధ్యాపకులకు నెలకు రూ.57,700 వేతనంతో మరో ఏడాదికాలంపాటు తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగింపునకు అనుమతిచ్చారు. కాగా ఈ ఏడాది కాలంలో ఖాళీ పోస్టులలో రెగ్యులర్ పద్ధతిలో అధ్యాపకులను భర్తీచేసే వరకు వీరిని కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 16నుంచి ఈ ఉత్తర్వులను అమలు చేయాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో దక్షిణం వైపు జరుగుతున్న భవనం సీలింగ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సెక్రటరీ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా గురువారం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రణాళిక మేరకు నిర్మాణ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ సీఈ జి.వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, రమణరావు, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకుందాం



ఈగల్ క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తుకు అవసరమైన యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకుందామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సమగ్రశిక్ష అభియాన్‌పై, ఈగల్ క్లబ్ ఏర్పాటుపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ ఆచూకీ తెలిపినవారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు వారికి రూ.25 వేలు నగదు బహుమతి ప్రకటిస్తున్నట్లు చెప్పారు. క్లస్టర్ స్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీల ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్య రహితంపై పిల్లలకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా చూడాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ పాఠశాలల సమీపంలో వున్న షాపుల్లో పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం లేకుండా చేస్తామన్నారు. బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రధాన కూడళ్లలో గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రగ్స్ అమ్మకాలు జరిపే దుకాణాల వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరి భారతి మాట్లాడుతూ మత్తుకు బానిసైన విద్యార్థులను గమనించి, కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు అక్రమంగా డ్రగ్స్ సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తనిఖీలను విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రూపొందించిన ఈగల్ క్లబ్ పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ వెంకటరమణ, డీఈవో వరలక్ష్మి, ఎంఈవోలు, క్లస్టర్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



బ్యాంకర్ల వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి ఆలోచనను అమలుచేసేందుకు అందరూ కృషిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ మీటింగ్ హాలులో వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఏపీఎంలతో బ్యాంకు లింకేజి పురోగతిపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో వున్న బ్యాంకు లింకేజిని పూర్తిచేయాలన్నారు. డీఆర్డీఏ ఏపీఎంలు, బ్యాంకు మేనేజర్లు సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలన్నారు. పొదుపు మహిళలకు రుణాలు మంజూరులో వివిధ బ్యాంకులు వెనుకబడివున్నాయని, వాటిని జనవరిలోగా అధిగమించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఎల్డీఎం హరీష్, నాబార్డు ప్రతినిధి ఇందిర, ఎస్బీఐ ఆర్ఎం పరశురామ్, యూబీఐ ఆర్ఎం రాకేష్, కెనరా బ్యాంకు ఆర్ఎం రామ్మోహన్, వివిధ బ్యాంకుల కస్టోడియల్ అధికారులు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ భూపతి అంత్యక్రియలు



భూపతి మృతదేహం వద్ద విలపిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన రామకుప్పం మండలం వీర్నమలకు చెందిన వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి పార్థివ దేహానికి గురువారం అశ్రునయనాలతో అంత్యక్రియలు జరిగాయి.వన్నెకులక్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్ తదితరులు భూపతి మృతదేహంపై టీడీపీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీకాంత్ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో, సమావేశాల్లో భూపతి తనతో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ విలపించారు.భూపతి కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గజదాడులు

● వరి, కొబ్బరి, మామిడి, ఉలవ, కంది పంటల ధ్వంసం



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట



ధ్వంసమైన కొబ్బరిచెట్టు

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీలో బుధవారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు దాడులు చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకుంది. దామల్‌చెరువులోని రైతు జమ్మత్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఒంటరి ఏనుగు విరిచేసింది. దిగుమూర్తివారిపల్లిలోని శంకరయ్య, నాగరాజు, నరసింహులు, శంకర, గురుస్వామి, అమర్‌నాథ్‌లకు చెందిన కొబ్బరి, మామిడి, నేరేడుచెట్ల కొమ్మలను విరిచేసిన ఒంటరి ఏనుగు ఉలవ, కంది, రాగి పంటలను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి కల్లూరు-కమ్మపల్లి రోడ్డును దాటుకున్న ఒంటరి ఏనుగు దేవళంపేటలోని సుధాకర్‌కు చెందిన వరి పంటను తొక్కేసింది. మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. శివరాం, మురళికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఒంటరి ఏనుగు విరిచేసి పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే ఒంటరి ఏనుగు అడవిలోకి చేరుకుంది. ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన పంటలను గురువారం ఉదయం అటవీ సిబ్బంది పరిశీలించారు. గురువారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

తిరుపతి విమానాశ్రయ సమీపంలో

ధార్మిక టౌన్‌షిప్‌కు సహకరించండి!

రెవెన్యూ మంత్రికి డెల్లా గ్రూప్ ప్రతినిధుల వినతి

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచీ సహాయ సహకారాలు అందించాలని డెల్లా గ్రూప్ ప్రతినిధులు గురువారం రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. అమరావతిలో మంత్రిని కలసిన గ్రూప్ ప్రతినిధులు తమ సంస్థ తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో 600 ఎకరాల భూమి సేకరించిందని, అందులో ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఐదు వేల ఏళ్ళ హిందూ మత, సాంస్కృతిక చరిత్రను ప్రపంచానికంతా చాటిచెప్పే లక్ష్యంతో ప్రాజెక్టు చేపట్టినట్టు వెల్లడించారు. వసుధైక కుటుంబం పేరుతో విమానాశ్రయానికి చేరువలో చేపట్టే అంతర్జాతీయ ప్రాజెక్టు భూమితో సహా మొత్తం ప్రైవేటుదేనని వివరించారు. అయితే దీనికి ప్రభుత్వం నుంచీ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా తిరుపతి ప్రపంచస్థాయి టూరిస్ట్ హబ్‌గా మారుతుందన్నారు. హిందూ మతంపై ప్రపంచంలోనే మొట్టమొదటి ఎగ్జిబిషన్, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆతిథ్యం, మెడికల్ వెల్‌నెస్ సెంటర్లు, అడ్వంచర్ పార్కులు, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, అత్యున్నత రియల్ ఎస్టేట్ తదితర అంశాలను మేళవిస్తున్నామని వెల్లడించారు. దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను వేగంగా ఇచ్చి, త్వరగా పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని మంత్రిని కోరారు. డెల్లా గ్రూప్ ప్రతినిధుల ప్రతిపాదన పట్ల రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు.ఇప్పటికే వివిధ దేశాల నుంచీ భక్తులు వస్తున్న తిరుపతిలో ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటైతే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. దీనికి ప్రభుత్వ పరంగా నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు త్వరగా ఇచ్చేందుకు ప్రయత్నిసా ్తమన్నారు.సీఎం చంద్రబాబుతో కూడా చర్చిస్తామన్నారు.డెల్లా గ్రూప్ ప్రతిపాదనల గురించి కలెక్టర్‌ను సంప్రదించగా గ్రూప్ ప్రతినిధులు మొదటిసారిగా జిల్లా ఇంఛార్జి మంత్రిని గురువారమే కలిసినట్టు వుందన్నారు. దానిపై మంత్రి పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశముందన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న తర్వాతే దానికనుగుణంగా తమకు సమాచారం వచ్చే అవకాశ ముందన్నారు. ప్రతిపాదిత భూములు ప్రైవేటువి కావడం వల్ల తమకు సమాచారం లేదన్నారు.

ఆటోను ఢీకొన్న మినీ వ్యాన్

● కూతురు మృతి... తల్లికి గాయాలు



ఆస్పత్రికి గాయపడ్డ శ్రీలేఖ తరలింపు

గుడిపాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో 190 రామాపురం సీఎంసీ వద్ద గురువారం ఉదయం మినీ వ్యాన్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్మోహన్ కథనం మేరకు.. పానాటూరు పంచాయతీలోని వల్లూరు ఏఎడబ్ల్యూకు చెందిన మురుగన్ భార్య శ్రీలేఖ, ఆమె తల్లి బుజ్జితో కలిసి సొంత పనుల నిమిత్తం చిత్తూరు వెళ్లారు. తిరిగి ఆటోలో గ్రామానికి వెళుతుండగా 190 రామాపురం సీఎంసీ వద్ద వెనుకవైపువస్తున్న మినీ వ్యాన్ ఢీకొనడంతో శ్రీలేఖ, ఆమె తల్లి బుజ్జి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీలేఖ మృతి చెందింది. ఆమెతల్లి చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫెన్సింగ్‌లో గుడిపాల విద్యార్థుల ప్రతిభ





వినీత్, దీక్షిత

గుడిపాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఫెన్సింగ్ పోటీల్లో తమ ప్రతిభను చాటుతూ మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో దూసుకెళుతున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు కోనసీమ జిల్లాలో రాష్ట్రస్థాయి ఈపీ ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో 9వ తరగతి చదువుతున్న దీక్షిత రాష్ట్ర స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. డిసెంబరులో మహారాష్ట్రలోని సాంబాజీనగర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడనుంది. అదేవిధంగా టీమ్ ఈవెంట్‌లో ఇదే పాఠశాలలో చదువుతున్న వినీత్ బ్రాంజ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దుర్వాసులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ టీఆర్ డిల్లీబాయి, పీడీలు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.

ఓటరు మ్యాపింగ్ పూర్తి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటరు మ్యాపింగ్‌కు సంబంధించి అన్ని కార్యక్రమాలు పూర్తిచేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ మ్యాపింగ్, సర్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరిస్తూ ఇప్పటికే సర్ కార్యక్రమ నిర్వహణపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ డీటీలు, బీఎల్వోలకు శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోల నియామకానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. 'బుక్ ఎ కాల్ విత్ బీఎల్వో' కార్యక్రమాలపై 117 వినతులు రాగా, 109 పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు లాటరీ విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర వివరాల మేరకు.. నగరంలో లాటరీ టికెట్లను విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో గురువారం పోలీసులు రెండు బృందాలుగా నగరంలో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో లాటరీ టికెట్లను విక్రయిస్తున్న భాగ్యరాజ్, రామచంద్ర, మూర్తి, సుబ్రహ్మణ్యంలను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.17,200 సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ● రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం నిబంధనలకు విరుద్ధంగా లాటరీ టికెట్లను విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించారు. స్థానిక మార్కెట్ చౌక్‌లో ఉమామహేశ్వర్ అనే వ్యక్తి వద్ద 29 లాటరీ టికెట్లు, రూ.3,020 సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కాంగ్రెస్ బాధ్యత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయకుమార్ తదితరులు

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత జాతీయ కాంగ్రెస్ పార్టీపై ఉందని ఏఐసీసీ సెక్రటరీ, కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణానికి సంబంధించి చిత్తూరు జిల్లా పరిశీలకులు జయకుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఆయన చిత్తూరు జిల్లా పరిశీలకుడిగా కుప్పం వచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయకుమార్ మాట్లాడుతూ దేశంలో కొంత బలహీనపడిన మాట వాస్తవమన్నారు. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా బలహీనమై పోయిందన్నారు. జిల్లాల స్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా పటిష్ఠంగా నిర్మించడానికి డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియకు తెరతీశామన్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా జరిపిన పాదయాత్రలో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. పార్టీపరంగా జిల్లా స్థాయిలో అన్ని అధికారాలు, బాధ్యతలు డీసీసీ అధ్యక్షులవేనని, సమర్థులైన వారిని ఆ పదవులకు పార్టీపరంగా ఎన్నుకుంటామని జయకుమార్ స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక కోసం తాను పదిరోజులపాటు జిల్లాలోనే పరిశీలనకుడగా పర్యటిస్తానని, వచ్చే నెల మొదటి వారంలో అధిష్ఠానానికి నివేదిక ఇస్తామని చెప్పారు. సమావేశంలో ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఉడత వెంకటరావు, ఏఐసీసీ నేషనల్ కౌన్సిలర్ దామోదరరావు, డీసీసీ అధ్యక్షుడు భాస్కరయ్య, కాంగ్రెస్ కుప్పం నియోకవర్గ అధ్యక్షుడు ఆవుల గోపి, నాయకులు, కర్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రమ.. జీవన విజయానికి మార్గం



వృక్షాలకు చిత్రాలు వేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సృజన, శ్రమ జీవన విజయానికి మార్గాలని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ.చిదంబరం అన్నారు. ఈ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గురువారం గుడుపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీలో వారం రోజులపాటు సాగే ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాలుపంచుకునే అవకాశాన్ని ఇటువంటి శిబిరాలు కల్పిస్తాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా విద్యార్థులు శెట్టిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని వృక్షాలను అందమైన బొమ్మలు పెయింట్ చేసి అలంకరించారు. అలాగే పాఠశాలలోని సృజనాత్మక నైపుణ్యంతో కూడిన చిత్రాలు వేసే మెలకువలను నేర్పించారు. కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎల్బీప్రదీప్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మోహన్, ఎల్లప్ప, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.నారాయణమూర్తి, అధ్యాపకులు ఎ.చంద్రబాబు, బాలకృష్ణ ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గజదాడుల కట్టడికి పటిష్ఠ చర్యలు



నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గజదాడుల నివారణకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషిచేస్తోందని, రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలమనేరు టీడీపీ కార్యాలయం వద్ద పలమనేరు రేంజి పరిధిలోని వి.కోట, బైరెడ్డిపల్లి, గంగవరం, పలమనేరు రూరల్ మండలాల్లోని ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెక్కులను అందజేశారు. 92 మంది రైతులకు గాను రూ.9.60 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. అటవీప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ అధికారుల సలహాల మేరకు రైతులు ప్రత్యామ్నా య పంటలపై మొగ్గు చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటి ఛైర్మన్ రాజన్న, టీడీపీ నాయకులు సోమశేఖర్‌గౌడు, నాగరాజరెడ్డి, ఆర్బీసీకుట్టితో పాటు అటవీశాఖ సబ్‌డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో నారాయణ, డీఆర్‌వో సలావుద్దీన్ తోపాటు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ శమిపతి యాదవ్

పుంగనూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మార్కెట్ యార్డులోని సమస్యలు పరిష్కరించి రైతులకు ఉపయోగకరంగా పాలకమండలి సహకారంతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ ఛైర్మన్ నల్ల బాల శమిపతి యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యార్డు ఆవరణలో చింతపండు నిల్వల కోసం గిడ్డంగులు ఏర్పాటు, సీసీ రోడ్డు, వ్యాపారస్తులు, కూలీలకు సౌకర్యాలు కల్పించేలా పనులు చేయాల్సి ఉందన్నారు. నాలుగు మంచి పనులు చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాల్సి ఉందని వివరించారు. కార్యదర్శి గోపీనాథ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం చెట్ల నరికివేతపై ఫిర్యాదు

సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట ఈద్గా వద్ద ఉన్న రెండు ఎర్రచందనం వృక్షాలను బుధవారం రాత్రి దుండగులు నరికి తీసుకెళ్లినట్లు గురువారం సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నంజంపేట ఎంపీటీసీ జిన్నా, మాజీ సర్పంచి ఖయ్యాం, కమిటీ సభ్యులు పుంగనూరు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



నంజంపేట ఈద్గా వద్ద దుండగులు నరికేసిన ఎర్రచందనం చెట్టు

సిండికేట్‌తోనే మామిడి రైతులకు నష్టం



సమావేశంలో పాల్గొన్న మామిడిరైతులు

పలమనేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గుజ్జు పరిశ్రమల సిండికేట్ కారణగానే మామిడిరైతులు నష్టపోతున్నారని జిల్లా మామిడిరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు మురళి అన్నారు. గురువారం పలమనేరులో జరిగిన మామిడిరైతుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన రూ. 8 గిట్టుబాటు ధర సాధన కోసం డిసెంబరు నెలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉమాపతినాయుడు మాట్లాడుతూ మామిడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఒక ఇండిపెండెంట్ సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. గుజ్జు పరిశ్రమల సిండికేట్లను అధిగమించాలంటే మామిడి రైతులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మునిరత్నం నాయుడు, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మామిడిరైతుల సంఘం పలమనేరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా ఉమాపతినాయుడు, కమిటీ సభ్యులుగా సుబ్రహ్మణ్యంనాయుడు, చెంగల్రాయనాయుడు, పురుషోత్తమ నాయుడు, సుబ్రహ్మణ్యం, జహీర్, గురుమూర్తిశెట్టి, వాసు, లోకనాథనాయుడు, గోవిందనాయుడు, భాస్కరనాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఈజీ మార్టును డీలర్లు సద్వినియోగం చేసుకోవాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

పలమనేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చౌకదుకాణ డీలర్లు ఈజీమార్టును ప్రారంభించుకోవాలని పలమనేరు ఆర్డీవో భవాని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 29 వేల చౌకదుకాణాలను కేంద్ర ప్రభుత్వంతో కలిసి మినిమాల్స్‌గా అభివృద్ధి చేస్తోందన్నారు. దీంతో ప్రస్తుతం చౌకదుకాణాల్లో సరఫరా అవుతున్న బియ్యం, చక్కెరతో పాటు వివిధరకాల ధాన్యాలు, నిత్యావసర సరుకులు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని డీలర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డీఎస్‌వో శంకరన్, ఈజీమార్టు ఎండీ వెంకటనారాయణ, పలమనేరు తహసీల్దార్ ఇన్నసాథన్, డివిజన్ పరిధిలోని చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్ ఫయాజ్

సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో స్వయం సహాయక బృందాల మహిళలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఏవో జయప్రకాశ్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవడానికి ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, రీసోర్స్ పర్సన్ ఫయాజ్, కార్యదర్శులు జయశంకర్, జయరాం, దివ్యభారతి, మేనక, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ప్రసన్న కుమార్

చౌడేపల్లె, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఆర్బ్ల్యూఎస్ ఈఈ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పెద్దకొండామరి, కాగతి, వెంగళపల్లె సచివాలయాలు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించాలని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవో లీలామాధవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి పోలీసుల తనిఖీలు

కుప్పం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కొత్తఇండ్లు గ్రామంలో తమిళనాడు పుదుచ్చేరి పోలీసులు గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తమిళనాడులో జరిగిన చోరీ కేసుకు సంబంధించి కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ కేసులో కొంత బంగారుతోపాటు మరికొంత నగదును వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి నుంచి 120 టెట్రా ప్యాకెట్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం పుంగనూరు మండలం వనమలదిన్నె ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణంలోని హనుమంతరాయదిన్నెకు చెందిన మునిరాజ, అబ్రార్ అనే వ్యక్తులు ద్విచక్రవాహనాల్లో అనుమానంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి వారి నుంచి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజలతో అధికారులు

మర్యాదపూర్వకంగా మెలగాలి

- కౌండిన్యనది ఆక్రమణలు తొలగించాలి
- మున్సిపల్ మీట్‌లో ఛైర్మన్ అలీంబాషా



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో వార్డు సచివాలయ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని, నిర్లక్ష్యం వీడి మంచిపేరు తెచ్చుకోవాలని పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన మున్సిపల్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో కొందరు అధికారులు సకాలంలో విధులకు హాజరుకాకపోవడం, ప్రజలను మర్యాద లేకుండా మాట్లాడటం, హేళనగా చూడటం, సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వివిధ పనులపై వచ్చిన ప్రజలపై మర్యాదగా స్నేహపూర్వకంగా వ్యవహరించడం నేర్చుకోవాలని, ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు దురుసుగా ప్రవర్తించడం సరికాదని హెచ్చరించారు. ఇందిరాసర్కిల్, కౌండిన్యనదిలో ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ రేష్మా మాట్లాడుతూ పుంగమ్మ చెరువు కట్టపై నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు రోడ్డు గుంతలు పడటంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. 11వ వార్డులో దోమలు, కుక్కలు బెడద నివారించాలని కోరారు. పట్టణ పరిధిలో జరిగిన ఆక్రమణలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళుతామని, రామసముద్రం రోడ్డు దుస్థితిపై ఆర్అండ్‌బీ అధికారులకు ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేశామన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు కావడంతో మున్సిపల్ నిధులు వెచ్చించలేమని, ప్రభుత్వ నిధులతోనే రోడ్డు రిపేర్లు చేయాలని వివరించారు. వారం రోజులుగా పారిశుధ్య పనులను పర్యవేక్షించానని, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ వేయిస్తానని చెప్పారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ నాగేంద్ర, డీఈఈ మహేశ్, కౌన్సిలర్లు అమ్ము, తుంగామం జునాథ్, కమలమ్మ, తాగ్యరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బైరెడ్డిపల్లె: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కల్లూరు: ఎల్లంకివారిపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు విద్యాసాగర్ నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. టీడీపీ నాయకులు గోపి నాయుడు, పరంధామ నాయుడు, దేవ, రవి నాయుడు, సిబ్బంది నీలిమ, శ్రీహరి, పద్మజ, రైతులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

సోమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సింగిల్ విండో డైరెక్టర్ అష్రఫ్ అలీ తెలిపారు. గురువారం నంజంపేటలో ఇంటింటా రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని.. ఈనెల 30 లోపు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. అలాగే వల్లిగట్ల పంచాయతీలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు విశ్వనాథం, చంద్రబాబు, సుబ్బరాయుడు, రమణయ్య ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు.

● **బైరెడ్డిపల్లె** : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుని పలు పథకాలు అమలుచేస్తున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంగంవారిపల్లె గ్రామంలో గురువారం జరిగిన రైతన్నా - మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాయితీ విత్తనాలను రైతులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, ఏవో గీతాకుమారి, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటసాయి, ఎంసీవో సురేష్‌బాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా, సింగిల్‌విండో ఛైర్మన్ నాగరాజు నాయుడు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్రగౌడు, నాయకులు పయణి, సుబ్రహ్మణ్యంగౌడు, రాజేష్, విశ్వనాథ్, శేషగౌడు, శ్రీనివాసమూర్తి, శంకరప్ప, కల్యాణ్, రామచంద్రగౌడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి

ఉన్నట్లా.. లేనట్లా..!

- కార్యాలయంలో ఖాళీ కుర్చీనే దర్శనం
- తాగునీటికి పాళ్యంపల్లె వాసుల అవస్థలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు



రెండు రోజుల క్రితం పాళ్యంపల్లె సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పుంగనూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం పాళ్యంపల్లె సచివాలయ పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పలు సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో ఎప్పుడూ ఖాళీ కుర్చీనే దర్శనమిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఏడాది క్రితం నుంచి గ్రామంలో మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు బోర్లలో ఉప్పునీరు వస్తుండటంతో గతంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయగా ఏడాదిగా బోరు మోటారు కాలిపోయి ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. తాగునీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నామని. తమకు మంచినీటిని సరఫరా చేయాలని మహిళలు సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపినా పట్టించుకొనేవారు కరవయ్యారు. సర్పంచ్ దృష్టికి సమస్యను తీసుకెళ్తే మాకు ఓట్లు వేయలేదని సమాధానమిస్తున్నట్లు ఆరోపించారు. సచివాలయంలో మిగిలిన సిబ్బంది సైతం కనిపించడం అరుదుగా మారుతోంది. కేవలం మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంట్ తప్ప మిగిలిన సిబ్బంది అసలు ఉన్నారా.. లేదా అన్నది అర్థం కాని పరిస్థితి.

కార్యదర్శి బి.గోవర్ధన్‌రెడ్డి ఈనెల 13వ తేదీ నుంచి విధులకు హాజరు కాకపోవడంతో అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు లేకుండా ఖాళీగా ఉంది. అలాగే సర్వేయర్ ఈనెల 18 నుంచి సంతకాలు చేయలేదు. గ్రామంలో పనిచేయని అధికారులు మాకొద్దంటూ వీరిని ఇక్కడి నుంచి బదిలీ చేసి పనిచేసే, ప్రజలకు అందుబాటులో ఉన్న సచివాలయ అధికారులను పాళ్యంపల్లె పంచాయతీ సచివాలయానికి నియమించాలని రోజూ తాము వివిధ పనుల కోసం సచివాలయానికి రావడం తప్ప కార్యదర్శి మాత్రం రావడంలేదని, కరెంట్ మీటర్ల ఎన్‌వోసీకి రూ.2 వేలు తీసుకుంటున్నారని బాధితులు వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి పాళ్యంపల్లె పంచాయతీ సచివాలయ కార్యదర్శి, గైర్హాజరైన సిబ్బందిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాళ్యంపల్లె పంచాయతీ సచివాలయ కార్యదర్శి, సిబ్బంది పనితీరు ఇష్టారాజ్యంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేస్తూ దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్ చెప్పారు. పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేస్తే కనీసం సెలవు పెట్టలేదని తెలిపారన్నారు. పంచాయతీ కార్యదర్శి పని తీరుపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

సదుం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సదుం గార్గేయ నది ఒడ్డున వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల ఎత్తుతో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం భక్తిశ్రద్ధలతో వేదపండితులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తమకు తోచిన ఆర్థిక సాయం స్వచ్ఛందంగా అందజేయాలని ర్వాహకులు కోరారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మదీనా మసీదు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్

- నిర్మాణానికి రూ.25 లక్షల ఎంపీ నిధులు

సదుం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సదుం గాంధీ వీధిలోని మదీనా మసీదు ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపీ మిథున్ రెడ్డి రూ.25 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులను మంజూరు చేసినట్లు ముతవల్లి మహమ్మద్ అలీ తెలిపారు.ముస్లిం మైనారిటీ నాయకులు మస్తాన్, కాలేషా, సయ్యద్ బాషా, ఖాజాపీర్, ఖమృద్దీన్, ఖాజీ సిరాజ్, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవిష్యత్తుకు ఇంటర్ విద్య కీలకం



వెంకటనాథరెడ్డి

సదుం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉన్నత భవిష్యత్తును నిర్దేశించేది ఇంటర్ విద్యాభ్యాసమేనని సదుం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు 50 రోజుల ప్రణాళికతో పకడ్బందీగా 'సంకల్ప- 2026' కార్యక్రమాన్ని గత సోమవారం నుంచి అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంకల్ప్ ప్రణాళికతో సత్ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. గత విద్యా సంవత్సరంలో తగ్గిన ఇంటర్ ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో పెట్టుకుని 2025-26 ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ప్రత్యేకంగా సంకల్ప కార్యక్రమాన్ని కళాశాలలో అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2026 ఫిబ్రవరి 20వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు మాసంలో నిర్వహించిన అర్ధ సంవత్సరం పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థులను బాగా చదివే(ఏ), సాధారణంగా చదివే(బీ), సరిగ్గా చదవని(సీ) విభాగాలుగా విభజించి ప్రత్యేక తరగతులు, మానిటరింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇళ్ల వద్ద శ్రద్ధగా చదవడంపై తల్లిదండ్రులు బాధ్యతగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చిత్తూరులో అభివృద్ధి వెలుగులు నింపుతున్నాం


సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించి ప్రజలకు విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో అభివృద్ధి వెలుగులు నింపుతున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం రాత్రి నగర పరిధిలోని కాణిపాకం రోడ్డులో సంతపేట విజయలక్ష్మీకాలనీ నుంచి బైపాస్ కూడలి వరకు రూ.78.55 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఎమ్మెల్యే స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం గాంధీరోడ్డు, డీఐ రోడ్డు కూడలిలో జీజేఎం ఆటో స్టాండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నేత వెంకటేశ్ యాదవ్, జిల్లా నేత కాజూరు బాలాజీ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన కాపు సంఘం నాయకులు

నగరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నూతనంగా నగరి సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరావును నగరి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు ఎం.వి.బాబు ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. శేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలకమండలి సభ్యులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధి శివ షణ్ముగ సుందర వినాయక ఆలయ నూతన పాలకమండలి సభ్యులతో గురువారం ఈవో వెంకటరాయలు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే సోదరుడు జీవన్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, అధ్యక్షులుగా రేవతి కన్నన్, సభ్యులుగా ఇ.వనిత, కె.నవీన్‌కుమార్, కె.మైథిలి, సి.వి.భాస్కర్, గుంటమ్మ, సుధ, రాధికలతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు శ్రీధర్ గురుకుల్ ప్రమాణ స్వీకారం చేశారు.

లలితమ్మకు ఎమ్మెల్యే నివాళులు



బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నలగాంపల్లెకి చెందిన వెంకటాద్రి పిళ్లై సతీమణి, టీడీపీ కార్యకర్త లలితమ్మ మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే మురళీమోహన్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం వారు నలగాంపల్లె గ్రామానికి చేరుకుని లలితమ్మ(79) భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, మాజీ సర్పంచు సురేంద్ర నాయుడు, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌గౌడ్, బుస్సా నాగరాజ గౌడ్, షీబా, స్వామిదాస్, ప్రసన్నవిజయ్ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


పీజీఆర్ఎస్ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో అనుపమ

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నగరి ఆర్డీవో అనుపమ తెలిపారు. గురువారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె పీజీఆర్ఎస్ పిటీషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కింద ఒకే వ్యక్తి ఫోన్ నంబరుపై అన్నారు, కేఎంపురం లెక్కదాఖల భూములకు సంబంధించి 29 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సమస్యలను ఎవరైతే తెలియజేస్తారో వారి నంబర్లనే దరఖాస్తులో నమోదు చేయాలని, ఇతర వ్యక్తుల నంబరు నమోదు చేయకూడదని పిటీషనర్లకు ఆర్డీవో సూచించారు. పిటీషనర్ల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. తహసీల్దార్ కె.నాగరాజు, రీసర్వే డీటీ ఎ.స్వరూపరాణి, సర్వేయర్ ఎస్.మార్కొండయ్య, ఆర్ఐ టి.నరసింహులు, వీఆర్వో మోహన, విలేజ్ సర్వేయర్లు నేతాజీ, నవీన్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పురుషోత్తం

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల తగ్గింపు, పచ్చదనాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యం, నీటి సంరక్షణ, పర్యావరణాన్ని మెరుగుపరచడం వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించవచ్చని వెదురుకుప్పం ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. గురువారం వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు మందిరంలో సంఘమిత్రలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు థీమ్-5 పరిశుభ్రమైన పచ్చని గ్రామం అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యదర్శులు కుమార్, చిన్నబ్బరెడ్డి, బాబు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యేల పరామర్శ


చంద్రమౌళిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి

పూతలపట్టు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల టీడీపీ మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి తల్లి సరోజమ్మ బుధవారం మధ్యాహ్నం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలుసుకున్న పలమనేరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు అమర్‌నాథరెడ్డి, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర నేత యువరాజులు నాయుడు, మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు చంద్రబాబు, కొత్తపల్లి బాబు, హరితో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు చంద్రమౌళిని పరామర్శించారు.

మొగిలీశ్వరుడికి రూ.2.93 లక్షల ఆదాయం


వేలం పాటలో పాల్గొన్న ఆలయ ఈవో, ధర్మకర్త

బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిలో స్వయంభుగా వెలిసిన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరుడికి వేలంపాట ద్వారా రూ.2,93,020 ఆదాయం వచ్చినట్టు ఆలయ ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ తెలిపారు. మొగిలీశ్వరుడి ఆలయ ప్రాంగణంలో గురువారం పార్కింగ్, కొబ్బరిచిప్పలు, పాదరక్షలు, తాత్కాలిక దుకాణాలకు బహిరంగ వేలం పాట జిల్లా దేవాదాయశాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్వేత ఆధ్వర్యంలో జరిగింది. ఈ వేలంలో పార్కింగ్, కొబ్బరిచిప్పలు, పాదరక్షకుల ద్వారా రూ.1,82,500, తాత్కాలిక దుకాణాల ద్వారా రూ.1,10,520 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. తలనీలాల వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని, త్వరలో తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. వేలంలో దుకాణాలు దక్కించుకున్నవారు సంవత్సర కాలం పాటు వాటిని నిర్వహించుకోనున్నట్లు వారు చెప్పారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పలమనేరు రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ నరసింహప్రసాద్ గురువారం పర్యవేక్షించారు. పశు వైద్యశాల, కన్నన్ కళాశాలకు సంబంధించిన ప్రహరీలను తొలగించే పనులను పరిశీలించి, ప్రణాళిక శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు 810 మీటర్ల మేరకు ప్రహరీలను తొలగించినట్లు ఏసీపీ నాగేంద్ర తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప

చిత్తూరు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వాడకంపై గురువారం మహిళా పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక గ్రీమ్స్‌పేట జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ చిన్నరెడ్డప్ప ముఖ్య అతిథిగా హాజరై... సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. మత్తు పదార్థాలు, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాల సిబ్బంది, కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పెనుమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి ఉందని, ఇచ్చిన మాట కోసం రైతులకు అండగా అడుగులు వేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాటిమాకులపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం రైతులకు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. పరమేశ్వర్‌రెడ్డి, అశోక్, రఘుపతి, మోహన్, శ్రీకృష్ణ, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి


ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హేమలత

పాలసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత అన్నారు. వెంగళ్రాజుకుప్పం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో గురువారం అధికారులతో కలిసి మహిళా, శిశు అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, పోషణ, శిశు సంక్షేమ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ షణ్ముగం, సీహెచ్‌వో లత, వెటర్నరీ అసిస్టెంట్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడానికే అన్నదాత సుఖీభవ

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడానికే అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తున్నట్లు కార్వేటినగరం మండల టీడీపీ నాయకులు వివరించారు. గురువారం కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లెలో రైతులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వడింగాడు రాజా, ఉపాధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్దన రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి మేలపూడి రాజేంద్రరెడ్డి, కృష్ణాపురం రిజర్వాయర్ చైర్మన్ మునికృష్ణయ్య, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షులు రవి యాదవ్, యూనిట్ ఇన్‌చార్జీలు రాజా, సోమశేఖర్ పాల్గొన్నారు.

కుంగిన వంతెన
ప్రయాణికులకు పాట్లు


మంగధానపల్లె వద్ద కుంగిపోయిన వంతెన

యాదమరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగధానపల్లె రోడ్డు వంతెన కుంగిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జోడిచింతల నుంచి కొటాల రహదారిపై మంగధానపల్లె వద్ద ఉన్న బ్రిడ్జి మూడు రోజుల క్రితం కుంగిపోయింది. దీంతో కల్వర్టు మధ్యలో పెద్ద రంధ్రం పడింది. దెబ్బతిన్న కల్వర్టు కారణంగా మూడు రోజులుగా ఆర్టీసీ బస్సులు క్రిష్ణంపల్లి నుంచి వెనుతిరుగుతుండడంతో స్కూల్ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత రహదారులు, భవనాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదకరంగా మారిన వంతెన మరమ్మతులు చేపట్టాలని, రోడ్డును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతే దేశానికి వెన్నెముక


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు, అధికారులు

బంగారుపాళ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని 170 గొల్లపల్లె గ్రామంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నముక అని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ శాఖ వారు ఏర్పాటు చేసిన రైతులకు మద్దతు ధర గోడపత్రికలను ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌నాయుడు, సింగిల్‌విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, వాసుదేవ నాయుడు, జనార్ధన్ గౌడ్, నేతాజీ నాయుడు, లోకనాథ నాయుడు, రాధాక్రిష్ణమ నాయుడు, ఉపసర్పంచు బాలాజీ, హరిప్రసాద్, డాక్టర్ ఆసీఫ్, తహశీల్దార్ షబ్బీర్ బాషా, వ్యవసాయ శాఖ ఏవో భారతి, ఏఎంసీ కార్యదర్శి వెంకటరమణ, డైరెక్టర్ హరి, సూపర్‌వైజర్ గంగయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు సమస్యలపై కలెక్టర్‌కు విజ్ఞప్తి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి మహిళకు, ఓ వ్యక్తికి చెక్కు అందజేస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో గుర్తించిన కొన్ని సమస్యలపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు గురువారం విజ్ఞప్తి చేశామని మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విపరీతమైన డయాబెటీస్‌తో బాధపడుతున్న నిరుపేద భవన నిర్మాణ కార్మికుడికి రూ.50వేలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులకు అనువైన మైదానం కోసం, 200 మీటర్ల మురుగునీటి కాలువల నిర్మాణం కోసం విన్నవించినట్లు తెలిపారు. బంగారుపాళ్యం మండలంలో నిరుపేద డయాలసిస్ పేషెంట్‌కు, చిత్తూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోకేశ్‌కి రూ.50వేలు చొప్పున ఆర్థికసాయం అందించినట్లు ఆయన చెప్పారు. కార్వేటినగరం డైట్‌కి రెండు కల్వర్టుల నిర్మాణం తదితర సమస్యలపై విన్నవించామని యుగంధర్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకోసం
తమిళనాడువాసి సైకిల్‌యాత్ర


ముత్తుసెల్వన్‌ను అభినందిస్తున్న మనోహర్‌గౌడ్, స్వామిదాస్

గంగాధరనెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గాను తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ సైకిల్‌యాత్ర సాగిస్తున్నారు. సైకిల్‌యాత్రలో భాగంగా గురువారం ఆయన గంగాధరనెల్లూరుకు చేరుకుని స్థానిక అధికారులతో కలిశారు. ముత్తుసెల్వన్ మాట్లాడుతూ కోటి మొక్కలు నాటించాలనే లక్ష్యంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో తాను ఐదేళ్ల క్రితం సైకిల్‌యాత్ర ప్రారంభించానన్నారు. ఇప్పటివరకు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో సైకిల్‌యాత్ర సాగించానని, త్వరలోనే ఇతర దేశాల్లో కూడా సైకిల్‌యాత్ర సాగించడానికి ప్రణాళికలు ఉన్నాయన్నారు. అనంతరం ముత్తుసెల్వన్ ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఇన్‌చార్జి సీఐ నిత్యబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, తాను చేస్తున్న సైకిల్‌యాత్ర గురించి వివరించారు. ముత్తుసెల్వన్‌ను పలువురు అధికారులు, టీడీపీనేతలు ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీనేతలు ఇమ్మాన్‌వేల్, జాన్, ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబుకు సన్మానం



విజయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల డైరెక్టరు(ఎంఎస్ఎంఈ) చినబాబును గురువారం మండలంలోని కళియంబాకానికి చెందిన టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళియంబాకం సాగునీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్, టీడీపీ నాయకుడు నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా
కూటమి ప్రభుత్వపాలన


టీడీపీనేతలతో కలిసి కరపత్రాలను పంపిణీచేస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీలోని దాసరపల్లె, ఆరిమాకులపల్లె గ్రామాల్లో టీడీపీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీనేతలు నరసింహులు నాయుడు, నియాజ్‌అలీ, నీరజాక్షులురెడ్డి, బాబునాయుడు, జీవరత్నం, అత్తేహర్ అలీ, శంకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, రైతులు, నేతలు పాల్గొన్నారు.

పీసీఆర్‌లో గెస్టు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథమెటిక్స్ గెస్టు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లతో డిసెంబరు ఒకటిన ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూల ద్వారా జరిగే సెలక్షన్‌కు హాజరుకావాలన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హేమాద్రి నాయుడు

గుడిపాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు గురువారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. రామభద్రాపురం పంచాయతీ దళితవాడకు చెందిన కొన్ని కుటుంబాలు స్థలాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ భూమిని గుర్తించి ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నేత వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

నగరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధి లోని నెత్తంకండ్రిగ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంఘిక శాస్త్ర ఎగ్జిబిషన్‌లో ఉత్తమమైన వాటికి హెచ్‌జీ ఫౌండేషన్ సభ్యులు గురువారం బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఉమాశంకర్ మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే ఉపాధ్యాయుడి బాధ్యతన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పద్మజ, బాబు, అనిత, బాబు, మురళి, మునికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

నగరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని నగరి పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి అన్నారు.రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ హరిబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్లెప్స్ సంస్థ సభ్యులు కలైవాణి, సుమ, ఇందుమతి, గుణ సుందరి తదితరులు పాల్గొన్నారు.

30న ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు

శ్రీరంగరాజపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం తయ్యూరు పాయకట్టు గంగమ్మగుడి దేవస్థానంలో వెలిసిన ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు ఈ నెల 30వ తేదీ, ఆదివారం జరుగుతుందని ఈవో వెంకట్రావు తెలిపారు. ఈ హుండీ లెక్కింపునకు ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు, పాయకట్టు ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా నిత్యబాబు



గంగాధరనెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా గోర్ల నిత్యబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో రెగ్యులర్ సీఐగా పనిచేస్తున్న నిత్యబాబును ఇక్కడ ఇన్‌చార్జి సీఐగా నియమించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి సీఐగా పనిచేస్తున్న కె.శ్రీనివాసంతి చిత్తూరు డీటీఆర్‌బీలో యథావిధిగా విధుల్లో కొనసాగనున్నారు.

రైతులకు పంచ సూత్రాలపై అవగాహన


టీడీపీ నేతలతో కలసి సీఎం రాసిన లేఖలను ఇస్తున్న ఎంపీడీవో

వెదురుకుప్పం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లెలో గురువారం నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పంచసూత్రాలపై రైతులకు ఎంపీడీవో పురుషోత్తం, వ్యవసాయాధికారి సి.వనిత అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచసూత్రాల్లో భాగంగా నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు రాసిన లేఖను రైతులకు అందించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్యాలయానికి రోడ్డు ఏర్పాటు చేయండి


పన్నూరు సబ్‌స్టేషన్ చుట్టూ ఉన్న బురద

విజయపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సార్... మా ట్రాన్స్‌కో కార్యాలయానికి రోడ్డు ఏర్పాటు చేయండి అంటూ విద్యుత్ వినియోగదారులు అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో కార్యాలయం నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. నూతన ట్రాన్స్‌కో భవనం నిర్మించారు గానీ తిరుత్తణి - నాగలాపురం తారురోడ్డు నుంచి ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకోవాలంటే బురదలో అడుగు వేయక తప్పడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. విధులకు హాజరయ్యే సిబ్బందికి సైతం ఇదే పరిస్థితి. ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ నీరు చేరడం వలన దోమల బెడద ఎక్కువగా ఉందంటున్నారు. కార్యాలయంలో వైర్లు తీసుకోవాలన్నా, విద్యుత్ స్తంభాలు తీసుకొని వెళ్లాలన్నా బురద రోడ్డుతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని వినియోగదారులు, సిబ్బంది కోరుతున్నారు.